యుద్ధసన్నాహాలతో ఎక్కువ నిమిత్తమన్న మాట! తమతప్పు కప్పిపుచ్చుకోవడానికి ఇతరులను నిందించడం సాధారణమే.

మూడవ ప్రపంచ యుద్ధమే తటస్థిస్తే రష్యా యింతవరకూ పడిన ప్రయాసలు వృథా కావడమే కాకుండా మళ్ళీ యీసారి పునర్నిర్మాణానికి ఎక్కువకాలం పడుతుంది. ప్రజలు ఇప్పుడు తిండికి, గుడ్డకూ కరువులేక హాయిగా ప్రశాంతంగా జీవనం సాగిస్తోంటే అనుభవమయికూడ మళ్ళీ కష్టాల నాహ్వానిస్తారవడం మూర్ఖం. ఇందులోనే "రష్యా యుద్ధానికి సిద్ధంగా ఉంది" అనే మాటలలోని యథార్థం స్ఫురిస్తోంది – తన మనస్సు బయట పెట్టుకున్నట్లయింది.

స్కెచ్

# అన్నయ్యకి ఉత్తరం

ఎ. రామచంద్ర శాస్త్రి

బాంధవ స్రవంతితో మిళితమైన ప్రేమవాహినీ సంగమంలో ఆనందాతిరేకంతో, లోకంలో మనవంటివారు లేరన్నట్లు సగర్వంగా "నిన్న" గడిపాం. "నేడు" మన ఉభయులం సుడులు తిరిగి వడివడిగా ప్రవహించే అపార్థ నిర్ఝరిణిలోపడి కొట్టుకుపోతున్నాం. ఆ మధురమైన గతం నా స్మృతిపథంలో పదేపదే నాట్యంచేస్తూ ఉంటుంది. అది నేనెలా మరువగలను? గతం గుర్తుకువచ్చి, నేడు మనమిలా దూరమయ్యామేమా? అని నేను ఒంటరిగా ఉన్నప్పుడల్లా నిర్వేదనపడుతూ ఉంటాను.

ప్రకృతిలో క్షణక్షణం మార్పు రావడం సహజమే అయినా, మన పూర్వపు ఊహలన్నీ గాలిమేడ లయిపోయినయ్! నేడు మనలో క్రోధం వెర్రి తలలువేసి, ప్రకృతి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాం. దురభిమానంతో మానవత్వాన్నే మరచిపోతున్నాం. ఏదో కొంచెం డొక్క శుద్ధికలిగి దానిమీదే జీవిత శకటం దొర్లిస్తున్నాం. లోకంలో సభ్యతగల వాళ్ళంగా నటిస్తున్నాం. కాని వాస్తవంగా హృదయాల్లో అతి నీచమైన కుళ్ళు భావాలుగల మనం "అసభ్యులు" అనిపించుకునేవారికన్న తక్కువ వర్గంలో చేరతాము.

నా గృహస్థ జీవిత విషయంలో, నీవు చాలా అపార్థం చేసుకున్నావు. మా దంపతల మధ్య ఏవేవో పొరపులు ఉన్నట్టుగా ఊహించావు. అంతమాత్రంచేతనే మా దాంపత్య ప్రేమకు కొలతలు కట్టవద్దు! ఆలు మగలమధ్య ఆమాత్రం అలకలు, ప్రతిచోటను ఉండనే ఉంటవి. మధు నా విషయంలో ఎన్నడూ ఏలోటూ రానీయడు. నా సోదరుడవై ఇంత సన్నిహితంగా ఉన్న నీవే మా ప్రేమను అర్థం చేసుకోలేకపోతే లోకం అపార్థం చేసుకోవడంలో ఆశ్చర్యమేముంటుంది?

మధు ఈనాడు మీ ప్రవర్తన చూచి పిచ్చివాడైపోతున్నాడు. విషమించిన మన బంధుప్రేమ, అతని ప్రశాంత హృదయాన్ని రగిల్చివేస్తోంది. సహృదయంతోను, గాఢాభిమానంతోను వారు చేసిన సహాయం ఇంతయని విలువ కట్టరానిది. ప్రత్యుపకారం లేకపోగా, మధు పక్షపాతియనీ, ఆత్మీయుల మాటలకు చెవియొగ్గి ప్రవర్తించే అవివేకియనీ సంఘంలో 'దుష్ప్రచారం' చేశారు. మీ విషయంలోనే కాదు. మరెవరి విషయంలోనైనా మధుచేసిన అన్యాయం లెక్క కొకటి చూపించండి? మధుని అనవసరంగా ఆడిపోయడం అన్యాయం! అసలు విషయం ఏమంటే మీవారికి మధు ఆత్మీయులకు వైమనస్యం ఏర్పడింది. అది పురస్కరించుకొని మధుని కూడా అపార్థం చేసుకొని దూరంచేశారు. వారి ప్రవర్తనకుకూడా మధేనా బాధ్యుడు? పైగా జీవన ప్రమాణం పెరగడంచేత పిల్లలుగల సంసారం

కాబట్టి కొంత ఇబ్బందిగా ఉందని వ్రాశానే గాని నాసంసారం నాకు భారమా? అన్నయ్యా! పుట్టెడు కాయలున్నా మామిడిచెట్టుకు భారం అనిపించదు! జీవితపథంలో నేను పెట్టింది ప్రథమపాదమే అయినా నా మధు సహాయంతో నిరభ్యంతరంగా సఫలం కాగలనని సగర్వంగా చెప్పతున్నాను.

ఆశాదృక్కులతో, వీధి మలుపులో, అటు నిటు చూచి యాచించే భిక్షగానికి అణా డబ్బులు దొరకిన వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటాడనీ, మనకంటే వాడే జీవితాన్ని నిర్విచారంగా గడుపుతాడనీ అన్నావు. నిజమే! కాని మన జీవితానికీ వాడి జీవితానికీ హిమాలయ పర్వతమంత తేడా ఉంది. భిక్షగాని కతని పొట్ట నింపుకోవడమే జీవితపరమార్థం. "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ" అన్నట్టుగా వాడికి 'నా' అనేవాళ్లుండరు. అయినా అందరు వాడివాళ్ళే! మరి మనకలా సాగదు. మన పొట్ట నింపుకోవాలి. మన పిల్లల పొట్టనింపాలి. మనం సాంఘిక ధార్మిక, రాజకీయాది నియమాలకు కట్టుబడి మెలగాలి. వాడికవేమీ ఉండవు. వాడు స్వతంత్ర వాయువుల్లో విహరించే స్వేచ్ఛాజీవి. అసలు స్వాతంత్ర్యం వాడి సొమ్మే! వాడు తాత్కాలిక వర్తమానాన్నే స్వర్గంగా తలుస్తాడు. మరి మనం వర్తమానంతోటే తృప్తిపడక భవిష్యత్తు విషయం కూడా విచారించుకోవాలి. ఇంతెందుకు? నిన్ను నూటిగా ఒక్క ప్రశ్న అడుగుతాను. సమాధానం ఏమి చెప్పతావ్?—"భిక్షుగాడి" జీవితం స్వేచ్ఛాజీవితమనీ, నిర్విచారమైనదనీ, ఆనందకరమైనదనీ మనం ఒప్పుకుంటున్నాం. అయితే మరి మనమంతా భిక్షుకులం ఎందుకు కాగూడదు? ఇలాంటి యక్షప్రశ్న వేస్తానని ఊహించి వుండవు గదూ? అందుకనే భిక్షగానికీ మనకూ చాల అంతరముందని చెప్పింది. అభిమానవంతులు యాచకవృత్తిని అవలంబింపరు. అంగవిహీనుడైనా ఆత్మాభిమాని యగువాడు కష్టపడియైనా స్వార్జితంమీదనే జీవిస్తాడు. ప్రాణం పోవుటకైనా ఒప్పుకుంటాడు కాని మానం పోవడానికంగీకరించడు! వల్లమాలిన నగల్ని వంటినిండా మోసి జార్జెట్టు సిల్కు చీరధరించి కారుల్లో విహరించేవారినే కాదు, విశేష భాగ్యంతో విమానాల్లో విశ్వాన్నంతా విలాసంగా విహరించే సంపన్నులనుకూడ చూస్తున్నా. ఇస్త్రీ మడత చెడకుండా కుర్చీలో కూర్చొని కలం పోటుతో కావలసినంత కనకాన్ని ఆర్జించే ఆఫీసరును-ప్రొద్దస్తమానం లెక్కలు ముక్కలు చేసుకున్నా పావలా డబ్బులు గడించ చేతకాని మానవుణ్ణీ చూస్తున్నా. అంతా మానవులమే. అయినా మానవునికీ మానవునికీ మధ్య ఇంత వ్యత్యాసం చూస్తూంటే నా మనస్సులో ఏవో ఇదమిత్థమని నిర్ధారింపలేని భావాలు పెల్లుబికి వస్తున్నయ్. దీనిని చూచి నీవు-నాకు ధనవంతుల యెడ అసూయ ఉన్నట్లు భావించడం కంటే నిర్ధనుల యెడ జాలి కలదని భావించడం బాగా ఉంటుందని తలుస్తాను...

స్త్రీలంటే నీ దృక్పథంలో చుల్కనగా ఉన్నట్టుంది. ఒక్క నీ దృష్టిలోనే కాదు. లోకంలో ఉన్న పురుషులందరి దృష్టిలోను ఇలాంటి భావమే ఉంటుంది. ఇలాంటి భావం కల్గి ఉండటం చాలా పొరబాటు. ప్రతిస్త్రీలోను ఒక మహత్తరమైన శక్తి నిద్రాణమై ఉంటుంది. జాగరితావస్థలో అది విజృంభించిందంటే దానినడ్డగల పరాశక్తి ప్రపంచంలోనే లేదు. పురుష పుంగవులకీ నా హెచ్చరిక డేంజర్ సిగ్నల్ లాంటిది...

భాంధవ్యం సున్నితమైన వీణవంటిది. తంత్రులు సరిగా ఉన్నంత వరకు దాని మధుర స్వరములు యెడతెరపిలేక ప్రవహించే జీవనది వలె అమృత బిందువుల నదించుచుండును. తంత్రీ విచ్ఛేదన జరిగినపుడు అన్నీ అపశ్రుతులే ఉద్భవించును. క్రొత్త తంత్రులు బిగించి పాడుమడ్డ వీణను బాగుచేసికొన్నటు హృదయ వీణకు కొంగ్రొత్త భావతంత్రులు బిగించుటయే విడిపోయిన బాంధవ్యం సరససరాగము లీనుటలో సఫలమగును.